# నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, బుధవారం 2 అక్టోబర్ 2024 | NIZAMABAD


నేటి నుంచి బతుకమ్మ ఉత్సవాలు





మంగళవారం ఎల్లారెడ్డి మోడల్ స్కూల్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

# పూల పండుగొచ్చే..

## తొమ్మిది రోజుల పాటు వేడుకలు
## ఎంగిలి పూలతో మొదలై సద్దుల బతుకమ్మతో ముగింపు

సుభాష్‌నగర్, అక్టోబర్ 1: మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక.. ఆడబిడ్డల ఆత్మీయ వేడుక బతుకమ్మ. తెలంగాణకు మాత్రమే పరిమితమైన ఈ పూల పండుగ రానే వచ్చింది. నేటి (బుధవారం) నుంచి తొమ్మిది రోజుల పాటు ఈ వేడుక జరుగనున్నది. ఎంగిల పూల బతుకమ్మతో ప్రారంభమై, అక్టోబర్ 10న సద్దుల బతుకమ్మతో ముగియనున్నది. ప్రకృతిని కొలవడమే పరామర్థంగా సాగే ఈ పండుగ మహిళలకు మాత్రమే ప్రత్యేకం. భక్తిశ్రద్ధలతో ప్రకృతిని కొలుస్తూ తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి ఆడి పాడుతారు. పాడిపంట, పిల్లజల్ల బాగుండాలని బతుకమ్మ రూపంలో ఉండే గౌరమ్మను వేడుకుంటారు.

**ఒక్కోరోజు ఒక్కో పేరుతో..**

ప్రకృతిని ఆరాధిస్తూ తెలంగాణ సంస్కృతిని చాటి చెప్పే పూల పండుగ బతుకమ్మ. ఆడబిడ్డలకు ఎంతో ఇష్టమైన ఈ వేడుకకు మహిళలు అత్తింటి నుంచి పుట్టింటికి చేరుకుంటారు. ప్రకృతిలో లభించే తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి ఆడి నీటిలో నిమజ్జనం చేస్తారు. తొమ్మిది రోజుల పాటు సాగే ఈ కార్యక్రమానికి తొమ్మిది పేర్లు ఉన్నాయి. తొలిరోజు బతుకమ్మను (3న) బుధవారం ఎంగిలిపూల బతుకమ్మ, రెండో రోజు అటుకల బతుకమ్మ, మూడో రోజు ముద్దపప్పు బతుకమ్మ, నాలుగో రోజు నానబియ్యం బతుకమ్మ, ఐదవ రోజు అట్ల బతుకమ్మ, ఆరో రోజు అలిగిన బతుకమ్మ, ఏడో రోజు వేపకాయల బతుకమ్మ, ఎనిమిదో రోజు వెన్నముద్ద బతుకమ్మ, తొమ్మిదొ రోజు సద్దుల బతుకమ్మ.. ఇలా రోజుకో విధంగా గౌరమ్మను కొలుస్తారు. చివరి రోజు ఆడబిడ్డలు ఆడిపాడి పోయిరా బతుకమ్మ, పోయిరావమ్మ... మళ్లొచ్చే ఏడాది తిరిగి రావమ్మ.. అని వీడ్కోలు పలుకుతారు. నీళ్లల్లో నిమజ్జనం చేశాక వాయినం ఇచ్చిపుచ్చుకుంటారు.

### ఇంటి దేవతగా కొలుస్తాం



తెలంగాణ పండుగ బతుకమ్మ బొడ్డెమ్మతో మొదలై సద్దుల బతుకమ్మ వరకు రోజుకో ప్రత్యేకత ఉంది. బతుకమ్మను ఇంటి దేవత గౌరమ్మగా కొలుస్తాం. 2014లో బంగారు బతుకమ్మ పేరుతో పుస్తకం రాశా. 33 జిల్లాల ఆటపాటలు, బతుకమ్మ ప్రాముఖ్యత తదితర అంశాలు ఎన్నో ఉన్నాయి.

**- సౌమ్య, రచయిత్రి, ఎల్లమ్మగుట్ట**

### ఆడబిడ్డల పండుగ



బతుకమ్మ పూల పండుగ. ఇది ఆడబిడ్డల పండుగ. ఊరంతా సందడిగా ఉంటుంది. దేవున్ని పూజించడంతో పాటు ప్రకృతి పూలు, చల్లని శీతాకాలం ప్రారంభాన్ని సూచించే పూల జాతర.


**- విజేత, ఉపాధ్యాయురాలు, గంగాస్థాన్**

### బంధుత్వం, ఆప్యాయతలు..



బతుకమ్మ పాటల్లో కష్ట సుఖాలు, ప్రేమ, స్నేహం, బంధుత్వం, అప్యాయతలు, భక్తి అన్ని ఉంటాయి. రకరకాల పూలు తెచ్చి బతుకమ్మను పేర్చి ఆడిపాడడం ఎంతో ఆనందంగా ఉంటుంది. బతుకమ్మ పండుగ తెలంగాణ సౌందర్యం, ఆత్మ గౌరవాన్ని పెంపొందిస్తుంది.

**- శాంత, గృహిణి, సీతారాం నగర్ కాలనీ**




జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వాజిద్ హుస్సేన్‌పై వివిధ ఆరోపణలు చేస్తూ వ్యవసాయ శాఖ కమిషనర్‌కు ఏఈవో లక్ష్మీకాంత్‌రెడ్డి చేసిన ఫిర్యాదు ప్రతి

# వ్యవసాయ శాఖలో వసూళ్ల పర్వం

- దూషణలు, వసూళ్ల పర్వంపై జోరుగా చర్చ
- జిల్లా వ్యవసాయాధికారిపై రెంజల్ ఏవో ఫిర్యాదు
- ఏవోపైనా ఫిర్యాదు చేసిన ఫర్టిలైజర్ షాపు యజమానులు
- ఇన్‌చార్జి మంత్రి ఆదేశాలు గంటల్లోనే బుట్టదాఖలు
- వ్యవసాయ శాఖ కమిషనర్ చెంతకు చేరిన పంచాయితీ

పరస్పర ఆరోపణలతో వెలుగులోకి..



**వ్యవసాయ శాఖలో** వసూళ్ల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అధికారుల పరస్పర దూషణలు, ఫిర్యాదులతో మూమూళ్ల పర్వం బయట పడింది. ఏకంగా జిల్లా అధికారిపైనే మండల స్థాయి అధికారి ఫిర్యాదు చేయడం, అదే అధికారిపై పలువురు ఫర్టిలైజర్ షాపుల యజమానులు తీవ్ర ఆరోపణలతో డీఏవోకు ఫిర్యాదు చేయడం కలకలం రేపింది. మొత్తంగా రైతుల సంక్షేమం కోసం పని చేయాల్సిన అధికారులు ఇలా రోడ్డున పడడం జిల్లాలో చర్చనీయాంశమైంది. డిజిటల్ క్రాప్ సర్వే విషయంలో తలెత్తిన విషయంతో మొదలైన ఈ రచ్చ ఇప్పుడు వ్యవసాయ శాఖ కమిషనర్ దాకా వెళ్లింది. ప్రభుత్వ శాఖల పనితీరును మెరుగు పరుస్తామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రకటించి 24 గంటలు కాకముందే ఈ వివాదం బయటకు వెలుగు చూడడం గమనార్హం. రైతాంగానికి మేలు చేసేలా పని చేయాలని, యాసంగికి ఇప్పటి నుంచే సమాయత్తం కావాలని మంత్రి హితబోధ చేసి వెళ్లిన మర్నాడే.. వ్యవసాయ శాఖలో వసూళ్ల ఆరోపణలు చెలరేగడం విశేషం.

*– నిజామాబాద్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

### వివాదానికి ఆజ్యం పోసిందిలా..

సెప్టెంబర్ 26 నుంచి డిజిటల్ క్రాప్ సర్వే మొదలైంది. కేంద్రం ఆదేశాలకు అనుగుణంగా దరఖాస్తులను స్వీకరించి ఫొటోలను సంబంధిత పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ సర్క్యులర్ జారీ చేసింది. అయితే, ఇప్పటికే తీవ్ర పనిభారంతో సతమతమవుతున్న ఏఈవోలు డిజిటల్ క్రాప్ సర్వేను విస్మరించారు. రెంజల్ మండలంలోని 5 క్లస్టర్లలో పని చేస్తున్న ఏఈవోలు కూడా సర్వే చేపట్టలేదు. ఇదే విషయాన్ని ఏవో.. జిల్లా వ్యవసాయాధికారికి ఫిర్యాదు రూపంలో పెట్టారు. ప్రభుత్వ ఆదేశాలను పాటించని కారణంగా స్థానిక ఏవో పెట్టిన మెసేజ్‌పై ఏఈవోల్లో చర్చ జరిగింది. పని ఒత్తిడిపై శనివారం కలెక్టరేట్‌లో పలువురు ఏఈవోలు నిరసన వ్యక్తం చేసిన సమయంలో ఏవో ఫిర్యాదుపైనా చర్చ జరిగింది. ఇదే విషయంపై మంత్రి జూపల్లి సోమవారం పర్యటన ముగించుకుని వెళ్లిన తర్వాత పలువురు వ్యవసాయాధికారులు అక్కడే ఉన్న కలెక్టర్‌ను కలిసి ఏఈవోల బాధలను చెప్పుకున్నారు. ఏవో ఫిర్యాదును కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.

ఈ నేపథ్యంలోనే రెంజల్ కూడా తిరుగుబావుట ఎగురవేశారు. దీనంతటికీ ఓ కీలక అధికారే కారణమని పేర్కొంటూ ఫిర్యాదు చేశారు. జిల్లా వ్యవసాయాధికారిపై తీవ్రమైన ఆరోపణలు చేస్తూ వ్యవసాయ శాఖ కమిషనర్‌కు, కలెక్టర్‌కు లేఖ రాశారు. ఇందులో వ్యవసాయ శాఖలోని వసూళ్ల పర్వానికి సంబంధించిన పలు అంశాలు ఉండడం దుమారం రేపుతున్నది. మరోవైపు బోధన్ డివిజన్‌లో కొంత మంది ఏఈవోలపై తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. ఒక అధికారి ప్రైవేట్ చిట్‌ఫండ్ కంపెనీకి ప్రాయోజిత సేవలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. ఇదే డివిజన్‌లోని మరో ఏఈవోపైనా సబ్సిడీ విత్తనాలను మాయం చేశారన్న అవినీతి ముద్ర ఉంది. రైతుబీమా దరఖాస్తుల స్వీకరణ సందర్భంలో ఒక ఏఈవో దరఖాస్తుకు రూ.250 చొప్పున వసూళ్లు చేసినట్లు ఆరోపణలు వచ్చాయి.

**డీఏవో వర్సెస్ ఏవో..**

వ్యవసాయ శాఖ బోధన్ డివిజన్ పరిధిలో తలెత్తిన ఈ వ్యవహారం యంత్రాంగాన్ని కుదిపేస్తున్నది. మరోవైపు, డీఏవో వాజిద్ హుస్సేన్ తన సుదీర్ఘ కాలం బోధన్ డివిజన్‌లోనే విధులు నిర్వర్తించడం విశేషం. ప్రస్తుతం రెంజల్ మండలానికి ప్రత్యేకాధికారి కూడా ఆయనే కావడం గమనార్హం.

**ఏ తప్పూ చేయలేదు..**

నేను ఎలాంటి తప్పూ చేయలేదు. అనవసరంగా కొంత మంది నన్ను టార్గెట్ చేసి ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు డిజిటల్ క్రాప్ సర్వే చేయాలని ఏఈవోలకు చెప్పా. వారు నిరాకరించిన విషయాన్ని మాత్రమే డీఏవోకు వాట్సప్ గ్రూపులో నివేదించా. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పని చేస్తున్న నన్ను ఈ పరిణామాలు ఎంతగానో ఇబ్బందికి గురి చేశాయి.

**- పి.లక్ష్మీకాంత్‌రెడ్డి, ఏవో, రెంజల్**

**కలెక్టర్‌కు నివేదించాను..**

ఏఈవో, ఏవోలకు మధ్య జరిగిన వివాదం మా దృష్టికి వచ్చింది. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులకు పూర్తి వివరాలతో నివేదించాను.

**- వాజిద్ హుస్సేన్, జిల్లా వ్యవసాయాధికారి**

### 'వేధింపులు తట్టుకోలేక పోతున్నాం'

రెంజల్, అక్టోబర్ 1: మండల వ్యవసాయశాఖ అధికారి వేధింపులను తట్టుకోలేక పోతున్నామని మండల సీడ్స్, పెస్టిసైడ్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు ఆరోపించారు. మండలంలోని బోర్గాంలో వారు మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. ఏవో లక్ష్మీకాంత్‌రెడ్డి తనిఖీల పేరుతో హడావుడి చేయడమే కాకుండా డబ్బులు డిమాండ్ చేస్తున్నారన్నారు. ఆయన వేధింపులను తట్టుకోలేక కలెక్టర్, ఎమ్మెల్యే, జేడీఏ, ఏడీఏకు ఫిర్యాదు చేశామని అసోసియేషన్ బాధ్యులు కార్తిక్, ఆరిఫ్, మోహన్‌రెడ్డి, శివకుమార్, నాగరాజు తెలిపారు.



బోర్గాంలో విలేకరులతో మాట్లాడుతున్న సీడ్స్, పెస్టిసైడ్స్ అసోసియేషన్ ప్రతినిధులు

# హైడ్రాను రద్దు చేయాలి

- కాంగ్రెస్ అంటేనే కూల్చడాలు
- మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి ధ్వజం



ఆర్మూర్‌టౌన్, అక్టోబర్ 1: కాంగ్రెస్ అంటేనే కూల్చడాలు, కాల్చడాలు, పేల్చడాలని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి విమర్శించారు. గతంలో ఇందిరాగాంధీ గరీబీ హఠావో అంటే.. ఇవాళ సీఎం రేవంత్‌రెడ్డి గరీబో కో బగావో అన్న నినాదంతో పని చేస్తున్నారని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. హైడ్రా పేరుతో హైదరాబాద్ వాసులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారన్నారు. హైడ్రా విషయంలో హైకోర్టు చేసిన వ్యాఖ్యలకు ఆయన హ్యాట్సాప్ చెప్పారు. హైడ్రాను వెంటనే రద్దు చేయాలని జీవన్ రెడ్డి డిమాండ్ చేశారు. పది నెలల కాంగ్రెస్ పాలనలో అన్ని కుంభకోణాలేనని, పంచభూతాలను దోచుకుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటి అమలు చేయలేదన్నారు. రైతుల రుణాలను మాఫీ చేయలేదన్న మాజీ ఎమ్మెల్యే.. రుణాలు మాఫీ చేయకపోతే రైతులే తరిమి కొడతారని హెచ్చరించారు. మహాలక్ష్మి కింద ప్రతి మహిళకూ రూ.2,500 ఇస్తామని, పింఛన్లు రెట్టింపు చేస్తామని చెప్పిన కాంగ్రెస్.. ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. హామీలు అమలు చేయలేకే హైడ్రా పేరుతో హైడ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు.





సక్సెస్ మీట్‌లో మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత కుంచాల, పక్కన సీపీ, అధికారులు

# సమన్వయంతోనే సానుకూల ఫలితాలు

- అందరి శ్రమ ఫలితమే లోక్ అదాలత్ సక్సెస్
- జిల్లా జడ్జి సునీత కుంచాల

వినాయక్‌నగర్, అక్టోబర్ 1: రాజ్యాంగ వ్యవస్థల మధ్య సమన్వయంతో సానుకూల ఫలితాలు సాధించ వచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. ఇటీవల నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ విజయవంతమైన నేపథ్యంలో మంగళవారం పోలీస్ కమిషనరేట్‌లో నిర్వహించిన లోక్ అదాలత్ సక్సెస్ మీట్‌లో సీపీ కల్మేశ్వర్ సింగేనవార్‌తో కలిసి ఆమె మాట్లాడారు. వినాయక నవరాత్రోత్సవాల బందోబస్తులో తీరిక లేకుండా ఉన్నప్పటికీ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయడానికి పోలీసు శాఖ తీవ్రంగా శ్రమించిందని ప్రశంసించారు. 12 వేల రాజీ పడదగిన క్రిమినల్ కేసులను పరిష్కరించుకోవడం గొప్ప విషయమన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం శ్రమిస్తూ తక్కువ సమయంలో ఎక్కువ కేసుల పరిష్కారంలో భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. కక్షిదారులను కేసుల రాజీ విషయంలో సమన్వయం చేసి కోర్టు మెట్ల వరకు వారిని తీసుకుని రావడం లోక్ అదాలత్ చైతన్య దీప్తికి నిదర్శనమన్నారు. స్వేచ్ఛ ఇవ్వడంతోనే సమాజంపై బాధ్యత, నేర రహిత వ్యవస్థ పట్ల లక్ష్యం లోక్ అదాలత్‌కు మార్గం చూపించిందని సీపీ కల్మేశ్వర్ అన్నారు. రాజీ పడదగిన క్రిమినల్ కేసులను ఇరు పక్షాలు కలిసి పరిష్కరించుకునే విధానంలో పోలీసులకు స్వేచ్ఛ ఇచ్చామని, ఆ దిశగా పోలీసులు విజయవంతమయ్యాయరన్నారు. సైబర్ నేరాలలో క్రియాశీలకంగా వ్యవహరించి బాధితులకు అండగా నిలిచామన్నారు. అనంతరం పోలీసులకు జడ్జి, సీపీ ప్రశంసా పత్రాలు అందజేశారు. అదనపు డీసీపీలు కోటేశ్వర రావు, శంకర్‌నాయక్, ఏసీపీలు రాజా వెంకటరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్, నారాయణ, శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మి నర్సయ్య, అసిస్టెంట్ పోలీస్ ప్రాసిక్యూటర్స్ మహమ్మద్ రహీమొద్దీన్, రాజేశ్‌గౌడ్, రాణి, జిల్లా కోర్టు లైజన్ ఆఫీసర్ శ్యామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటిబాట





### నేటి నుంచి దసరా సెలవులు

కామారెడ్డి, అక్టోబర్ 1: బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా నేటి నుంచి విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. ఈ నెల 2 నుంచి 14వ తేదీ వరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవులు ఇస్తున్నట్లు కామారెడ్డి డీఈవో రాజు మంగళవారం తెలిపారు. అక్టోబర్ 15న స్కూళ్లు పునః ప్రారంభమవుతాయన్నారు. సెలవు రోజుల్లో ఎవరైనా ప్రైవేట్ తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు ఇంటిబాట పట్టారు.







విద్యాసంస్థలకు దసరా సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు ఇంటి బాట పట్టారు. దీంతో మంగళవారం బస్సులు, బస్టాండ్లు కిక్కిరిశాయి. రద్దీకి అనుగుణంగా బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బస్సుల్లో సీట్లు కాదు కదా.. కాలు పెట్టేందుకు స్థలం దొరకక అవస్థలు పడ్డారు. నిజామాబాద్, కామారెడ్డి, ఆర్మూర్, బోధన్ బస్టాండ్లన్నీ ప్రయాణికులతో కళకళలాడాయి.

# రూ.వంద కొట్టు.. మేక పట్టు

దసరా వేళ స్పెషల్ స్కీం

పొతంగల్, అక్టోబర్ 1: దసరా పండుగ సందర్భంగా వివిధ వ్యాపార, వస్త్ర సంస్థలు ఆఫర్లు ప్రకటిస్తుంటాయి. బహుమతులు, లక్కీ డ్రాల పేరిట కస్టమర్లను ఆకర్షిస్తుంటాయి. ఇదే లాజిక్కుతో కొందరు యువకులు నిజామాబాద్ జిల్లా పొతంగల్ మండలంలోని కొడిచర్లలో దసరా స్పెషల్ స్కీం ను తీసుకొచ్చారు. 'రూ.వంద కొట్టు.. మేక పట్టు' అంటూ గ్రామస్తులను ఆకర్షిస్తున్నారు. ఇలా అందరి దగ్గర రూ.100 తీసుకుని, ఈ నెల 10న లక్కీడ్రా నిర్వహించనున్నారు. మొదటి బహుమతిగా మేక పొట్టేలు, రెండో బహుమతిగా లిక్కర్ (రెండు ఫుల్ బాటిళ్లు), మూడో బహుమతిగా రెండు కాటన్ల బీర్లు, నాలుగు, ఐదో బహుమతులుగా నాటు కోళ్లు, పన్నీరు ఇస్తామని ప్రకటించారు. దీంతో గ్రామస్తులు ఎగబడి ఆ కూపన్లను కొనుగోలు చేస్తున్నారు.





కొడిచర్లలో యువకులు ముద్రించిన కూపన్లు